

బుధవారం మధ్యాహ్నం రోడ్డుపక్కన నిల్చున్న జనాన్ని చూసి బస్సుల్లోంచి చిరునవ్వులు చిందిస్తున్న వైఎస్ జగన్

జనం తుస్..!



ప్రొద్దుటూరులో జరిగిన మేమంతా సిద్ధం సభలో జగన్ మాట్లాడుతున్న సమయానికి జనం లేక ఖాళీగా ఉన్న గ్యాలరీలు

సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ అధికారం కోసం తాపత్రయ పడుతున్న జగన్ అండ్ కోకు సొంత జిల్లావాసులే షాకిచ్చారు. ప్రొద్దుటూరులో జరిగే సిద్ధం సభకు తొలుత లక్ష అన్నారు. తరువాత లక్షా 50వేల మందితో జరుపుతామన్నారు. వైసీపీ నేతలు చెప్పిన మాటలకు.. సభకు వచ్చిన జనాలను చూస్తే నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారం కోసం మేమంతా సిద్ధ మంటూ రాష్ట్ర వ్యాప్తంగా జగన్ బసుయాత్రకు శ్రీకారం చుట్టారు. అయితే గత ఎన్నికల్లో ఒక్కచాన్స్ అని చెబితే నమ్మి మీకు అధికారం ఇస్తే కొందరు ఎమ్మెల్యేలు, మరికొందరు వైసీపీ నేతలు చేసిన దాష్టీకానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. మీరు సిద్ధమైనా సరే మేం సిద్ధంగా లేమంటూ ప్రొద్దుటూరు సభ సాక్షిగా జనం చూపించారు. ఎన్నికల షెడ్యూలు వచ్చినా కూడా ఇంకా అధికారం మాదేనన్న భ్రమలో వైసీపీ నేతలు ఉన్నారు. వారు ఏర్పాటు చేసుకున్న వలంటీర్ల ద్వారా బలవంతంగా జన సమీకరణ చేసినా జనం ముఖం చాటేశారు. ఒత్తిళ్లు, పథకాలు పోతాయేమోనన్న భయంతో కొందరు వచ్చినా.. వచ్చిన వారు వచ్చినట్లే ముఖం చాటేశారు. సొంత జిల్లాలో తొలి సభ వైసీపీ ఊహించిన దానికి భిన్నంగా జరగడం ఇప్పుడు సీఎం సొంత గడ్డలోనే హాట్‌టాపిక్‌గా మారింది.

- జగన్ బస్సు యాత్ర..
- ప్రొద్దుటూరులో సభ
- సభ ప్రారంభం కాగానే
- తిరుగుముఖం పట్టిన జనం
- ఖాళీ గ్యాలరీలతో
- దర్శనమిచ్చిన సభాప్రాంగణం
- లక్షా 50 వేల మందితో సభ అన్నారు
- వచ్చింది.. 30 వేల మంది లోపే..

ప్రొద్దుటూరు/ కడప, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల సమరానికి ప్రారంభించిన బస్సు యాత్ర తుస్సుమంది. సాయంత్రం 4 గంటలకు సభ అని చెప్పి నిర్వాహకులు సభా ప్రాంగణానికి జనాలను మండుటెండలో తరలించారు. ఏడు నియోజకవర్గాల నుంచి ప్రజలు ఉదయమే ఆయా ప్రాంతాల నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ ఎండలో నిలువ నీడలేక బస్సుల నీడ కింద కూర్చొని అగచాట్లు పడ్డారు. సాయంత్రం 4 గంటలకు రావాల్సిన జగన్ బస్సు యాత్ర సభా ప్రాంగణానికి చేరుకునే సరికి 6.30 దాటింది. జగన్ బస్సులో నుంచి సభా ప్రాంగణానికి వెళ్లే సరికే జనం ఇంటిబాట పట్టారు. జగన్ వేదిక మీది నుంచి అభివాదాలు పూర్తి చేసుకుని ప్రసంగం ప్రారంభమయ్యే సరికే 7గంటలు దాటింది. దీంతో చుట్టు పక్కల నియోజకవర్గాల నుంచి వచ్చిన జనం ఇంటిబాట పట్టారు. గంటసేపు పైగా జగన్ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారు. అరిగిపోయిన రికార్డు లాంటి జగన్ ఉపన్యాసం వినలేక విసుగు చెందిన జనం చాలా మంది గ్యాలరీల్లో నుంచి చల్లగా జారుకున్నారు. జెండాలు ఫ్లకార్డులు సైతం అక్కడే గ్యాలరీల్లో కుప్పలుగా పడవేసి ఉన్నాయి. దీన్ని బట్టి ప్రొద్దుటూరు నుంచి మొదలు పెట్టిన వైసీపీ సిద్ధం సభకు జనం సంసిద్ధంగా లేమని చాటినట్లయింది.

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సుయాత్రను ప్రారంభించి ప్రొద్దుటూరులో పార్లమెంటు స్థాయిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు లక్ష యాభై వేల మంది వస్తారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని నిర్వాహకులైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, వైసీపీ నాయకులు ఆర్భాటపు ప్రకటనలు చేశారు. ప్రతి పార్లమెంటు సభ లక్ష మందికి పైగా జనం తో నిర్వహిస్తామని ప్రకటించి మొదటి సభకే విఫలం అయ్యారు. లక్షలో సగం కూడా కాకుండా మొత్తం కడప పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి 30 వేలకు మించి రాలేదని సాక్షాత్తు ఇంటలిజెన్సు నివేదికలే చెబుతున్నాయి. కడప, అనంతపురం, నంద్యాల తిరుపతి జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులను తెప్పించి జనాన్ని తరలించారు. బస్సుకు 10వేల చొప్పున డబ్బులు పంపిణీ చేసినా.. మద్యం బాటిళ్లు, బిర్యానీ ప్యాకెట్లు పంచినా జనం మాత్రం జగన్ మాట్లాడుతుండగానే సభా ప్రాగంణం నుంచి ఉడాయించారు. కొన్నిచోట్ల మద్యం తాగి బస్సుల వద్దే పడిపోయారు. మరికొందరు సభా ప్రాంగణం పరిసరాల్లోనే సిద్ధం ఫ్లకార్డులు, వైసీపీ జెండాలు పట్టుకుని మరీ మద్యం తాగుతూ మిక్చర్ తింటూ ఎంజాయ్ చేశారు.

ఉదయం బయలుదేరి వస్తే సభ పూర్తయి వెళ్లే సరికి రాత్రి 8 గంటలు దాటడంతో మహిళలు చాలా చోట్ల నిర్వాహకులతో గొడవపడ్డారు. అంతేకాకుండా మహిళలకు రూ.300 వంతున డబ్బులు పంచమని పార్టీ డబ్బులు ఇస్తే జనం తీసుకొచ్చిన నాయకులు రూ.200 మాత్రమే ఇచ్చి చేతివాటం ప్రదర్శించటంతో మహిళలు వాగ్వాదానికి దిగారు. ఏదేమైనా జగన్ ఆర్భాటంగా మొదలెట్టిన మొదటి సభ దాదాపు వారు అనుకున్న స్థాయిలో లేక విఫలం అయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీ పెద్దలు బస్సు యాత్రతో కూడిన సంసిద్ధం సభలకు ఊహించిన స్థాయికి ఏ మాత్రం దగ్గరలో జనం నుంచి స్పందన కరువైందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా...

సీఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 21 రోజుల బస్సు యాత్రకు తన సొంత గడ్డ నుంచి బయల్దేరారు. ఆనవాయితీగానే ఇడుపులపాయలో తన తండ్రికి నివాళులర్పించి బస్సు యాత్ర చేపట్టారు. బస్సుయాత్ర మొదలు పెట్టినప్పటి నుంచి ప్రొద్దుటూరు సభను వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందుకు గాను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జన సమీకరణ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు కడపలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బూత్‌స్థాయి నుంచి టార్గెట్లు పెట్టారు. ఇంత మంది జనం తీసుకురండి, మీకు ఇన్ని వాహనాలు ఇస్తామంటూ హుకుం జారీ చేశారు. 48 నెలలు మీకు మేం గుర్తుకు రాలేదు, ఇప్పుడు మేం గుర్తుకు వచ్చామా అంటూ కొందరు వైసీపీ నేతలు నియోజకవర్గ సమావేశంలోనే పెదవి విరిచారు. జనాలను తీసుకురావడం మా వల్ల కాదంటూ తెగేసి చెప్పుకొచ్చారు. అయినప్పటికీ సభను భారీ విజయవంతం చేసేందుకు శ్రమించారు.

బలవంతంగా బస్సుల్లో తీసుకొచ్చినా...

కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో దాదాపు 400కు పైగా ఆర్టీసీ బస్సుల్లో జనాలను తీసుకువచ్చారు. కడప జిల్లా నుంచే 90 బస్సులను తీసుకువచ్చారు. వీటితో పాటు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు, ట్రాక్టర్లు ద్వారా జన సమీకరణకు ప్రయత్నంచారు. 1.50 లక్షల మంది జనాలను టార్గెట్ అనుకున్నారు. అయితే మీటింగ్‌కు 30వేల మంది లోపే హాజరై ఉంటారని చెబుతున్నారు. బస్సులు పెట్టినప్పటికీ ఒక్కో బస్సులో సగటున 15 నుంచి 18 మంది ప్రయాణించి ఉంటారు. బలవంతంగా జనాలను తీసుకువచ్చారు. 4గంటలకు మీటింగ్ అని చెప్పి మధ్యాహ్నం నుంచే బయల్దేరారు.

అంచనాకు తగ్గ జనం లేక...

కడపలో కార్పొరేటర్లకు టార్గెట్ పెట్టారు. వాహనాలతో పాటు ఒక్కో బస్సుకు పదివేలు ఖర్చు వచ్చినట్లు చెబుతారు. బస్సులు వచ్చాయి తప్ప బస్సుల్లో జనాలు లేరు. సీట్లు ఖాళీగా కనిపించాయి. 4గంటలకు సభ అనడంతో అప్పటికే మంది వచ్చారు. సభాప్రాంగణంలో కుర్చీలు తప్ప జనం కూర్చునేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో ఎండకు తట్టుకోలేక బస్సుల మాటునే కూర్చున్నారు. వలంటీర్లు చెప్పారు, నాయకులు చెప్పారు వచ్చాం. ఇక వెళదామంటూ 5.30 నుంచి జనం తిరుగు బాట పట్టారు. దీంతో బస్సులు వచ్చినవన్నీ వెళ్లిపోయాయి. జనం కూడా బస్సుల్లో కనిపించారు. ఇక సిద్ధం సభ కోసం భారీ ఎత్తున చైర్లు తీసుకువచ్చారు. అయితే జనం లేకపోవడంతో దాదాపు 3, 4 లారీల నిండా తెచ్చిన కొన్ని కుర్చీలు దించలేదు. ఒకటిన్నర లక్ష జనం వస్తారంటూ వైసీపీ నేతలు జబ్బలు చరచుకున్నారు. అయితే వారి అంచనాకు తగ్గ జనం కనిపించకపోవడంతో సభ తుస్సుమంది. మేం సిద్ధమన్నా కూడా జనం మాత్రం మేం సంసిద్ధంగా లేమంటూ జగన్ అండ్ కోకు సిగ్నల్స్ ఇచ్చారు.

స్పీచ్‌పై నిరాశ..

ఇక ఎన్నికల ప్రచారం సొంత జిల్లా నుంచే ప్రారంభించడంతో ఏమైనా హామీలు ఇస్తారని జిల్లా వాసులు భావించారు. ఇలా ప్రతి మీటింగ్‌లో ఎల్లో మీడియా అంటూ చంద్రబాబు, పవన్‌లపై ఏడ్చినట్లుగానే ఇక్కడ అదే ఏడుపు ఏడ్చారు. తన చెల్లెళ్లను విడదీశారని చెప్పుకొచ్చారు. చిన్నాన్న వివేకాను హత్య చేసింది దేవుడికే తెలుసంటూ, చంపిన వారికి మా చెల్లెళ్ల మద్దతు ఇస్తున్నారంటూ కవరింగ్ ఇచ్చినప్పటికీ అది వర్కవుట్ కాలేదంటారు. నిజంగా చిన్నాన్న వివేకాపై ప్రేమ ఉంటే జగన్ సీఎం అయిన కాలంలో ఎన్నోసార్లు వైఎస్ జయంతి, వర్ధంతితో పాటు క్రిస్మస్ ఇతర కార్యక్రమాలకు ఇడుపులపాయ పులివెందులకు వచ్చి ఉంటారు. మరి వచ్చినప్పుడు వివేకాకు ఎందుకు నివాళులర్పించలేదంటూ కొందరు విమర్శిస్తున్నారు. ఏదో సొంత జిల్లాలో జరిగే సభలో మేనిఫెస్టో ఉంటుందని అందరూ ఆశించారు. రోజూ చెప్పే డైలాగులే.. తనకు గిట్టని వారిపై అదే అక్కసు ప్రదర్శించడంతో జనాలు నిరాశకు గురయ్యారు.





బస్సు యాత్రకు పక్క జిల్లాల నుంచి జనాన్ని తీసుకొచ్చిన పెనుగొండ, బనగానపల్లె బస్సులు



వేంపల్లెలో బస్సుయాత్ర బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ



పులివెందులలో సగానికి పైగా ఖాళీగా ఉన్న సిద్ధం బస్సు



ప్రొద్దుటూరులో జగన్ ప్రసంగం మొదలుకాగానే వెళ్లిపోతున్న జనం



ప్రొద్దుటూరులో సిద్ధం సభకు తెచ్చిన కుర్చీలు జనం రాకపోవడంతో లారీకే పరిమితమైన దృశ్యం





సిద్ధం సభ వద్ద మందుబాబులు

ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ 'సిద్ధం'కు దూరం

ప్రొద్దుటూరు, మార్చి 27: జగన్ నోరుతెరిస్తే నా ఎస్సీ నా బీసీ అని చెప్పే మాటలకు ఆచరణకు తీవ్ర వైరుధ్యం ఉంది. జగన్ ఇడుపుల పాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రారంభించిన బస్సుయాత్రలో భాగంగా బుధవారం ప్రొద్దుటూరులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' పేరిట నిర్వహించిన మొదటి సభకు వైసీపీలో బీసీ నాయకుడు ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ కనిపించలేదు. రమేశ్ యాదవ్ కేవలం ఎమ్మెల్సే మాత్రమే కాదు.. బీసీ సాధికార కమిటీకి చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన స్వంత ఊర్లో జగన్ మొదటి సభ పెట్టినా రమేశ్ యాదవ్ హాజరు కాకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రొద్దుటూరులో ఒక్క అధికారిక కార్యక్రమానికి కూడా ఆయనకు ప్రొటోకాల్ ప్రకారం పిలుపులేదు. అభివృద్ధి కార్యక్రమాలకు వేసిన శిలాఫలకాల్లో సైతం ఆయన పేరుకూడా ఇక్కడ ఎమ్మెల్యే రాచమల్లు పెట్టనీయకుండా చేశాడని, బీసీ నేత అయిన తనకు అడుగడుగునా అవమానం చేసినా అధిష్టానం గానీ జగన్ గానీ పట్టించుకోలేదని సమాచారం. గతంలో ప్రొద్దుటూరులో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో సైతం ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్‌కు పిలుపు లేదు. దీన్ని బట్టే జగన్ చెప్పే బీసీల మీద ప్రేమ ఎలాంటిదో తేటతెల్లమౌతున్నది. అంతేకాకుండా ప్రొద్దుటూరు వైసీపీలో ఎమ్మెల్యే రాచమల్లుప్రసాద్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉన్న వర్గం సిద్ధం సభకు రాలేదు.

బీజేపీ అభ్యర్థులు ఖరారు

- జమ్మలమడుగు నుంచి ఆదినారాయణరెడ్డి
- బద్వేలు బరిలో బొజ్జా రోశన్న

(కడప - ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఉమ్మడిగా పోటీ చేయనున్నాయి. పొత్తులో భాగంగా జమ్మలమడుగు, బద్వేలు అసెంబ్లీ స్థానాలను బీజేపీకి కేటాయించారు. అయితే ఇక్కడ పోటీ చేసే అభ్యర్థులను బీజేపీ అధిష్టానం బుధవారం ఖరారు చేసింది. జమ్మలమడుగు నుంచి మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేయనున్నారు. ఈయన 2004, 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జమ్మలమడుగు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం టీడీపీలో చేరి మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల తరువాత బీజేపీలో చేరారు. జమ్మలమడుగు స్థానాన్ని టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి ఆశించారు. అయితే పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు. ఆదినారాయణరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఇక బద్వేలు అభ్యర్థిగా రోశన్నను ప్రకటించింది. నీటిపారుదలశాఖలో డీఈగా పనిచేస్తున్న రోశన్న ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలకు వచ్చారు. టీడీపీ నుంచి బరిలో దిగాలనుకున్నారు. అయితే ఇటీవలనే ఆయన బీజేపీలో చేరారు. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడంతో రోశన్న అభ్యర్థిత్వాన్నే ఖరారు చేశారు.



రోశన్న



ఆదినారాయణ రెడ్డి

షోలాపూర్ ప్రత్యేక రైలు గడువు పొడిగింపు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 27: షోలాపూర్-తిరుపతి-షోలాపూర్ మధ్య నడిచే (01437/01438) ప్రత్యేక రైలు గడువును ఈ ఏడాది జూన్ 28వ తేదీ వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్స్‌పెక్టరు జనార్ధన్ తెలిపారు. ఈ రైలును మార్చి 29వ తేదీ వరకు నడవనున్నట్లు అధికారులు గతంలో ప్రకటించారు. అయితే వేసవిలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని భావించిన రైల్వే ఉన్నతాధికారులు జూన్ 28 వరకు గడువు పొడిగించారు. షోలాపూర్ నుంచి తిరుపతికి (01437) వెళ్లే రైలు ప్రతి గురువారం రాత్రి 9.40కు షోలాపూర్‌లో బయల్దేరి లాతూరు-కమలాపూర్, వాడి, యాద్గిరి, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి మీదుగా శుక్రవారం సాయంత్రం 4.15కు ఎర్రగుంట్లకు, 4.55కు కడపకు, 5.45కు రాజంపేటకు, రాత్రి 7.45కు తిరుపతికి చేరుకోనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో (01438) తిరుపతిలో ప్రతి శుక్రవారం రాత్రి 9.10గంటలకు బయల్దేరి రాజంపేటకు రాత్రి 10.30 గంటలకు, కడపకు 11.10కి, ఎర్రగుంట్లకు రాత్రి 11.50కు చేరుకని శనివారం సాయంత్రం 7.10గటలకు షోలాపూర్ చేరుకోనుంది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


వైఎస్సార్ ఘాట్‌లో నివాళులు.. సర్వమత ప్రార్థనలు

వేంపల్లె, మార్చి 27: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ఇడుపులపాయలో బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. ప్రత్యేక బస్సులో కూర్చొని యాత్రను సాగించారు. విజయవాడ నుంచి మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో కడపకు చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా ఇడుపులపాయకు చేరుకున్న జగన్ నేరుగా వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించారు. తల్లి విజయలక్ష్మి, ఎంపీ అవినాష్‌రెడ్డి ఇతర కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలు, పలువురు ముఖ్యనేతలతో కలిసి వైఎస్ సమాధి వద్ద నివాళులర్పించారు. మొదట సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బస్సు యాత్రను చేపట్టారు. ఇడుపులపాయ నుంచి వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లె మీదుగా వేంపల్లెకు చేరుకున్నారు. నాలుగురోడ్ల కూడలి సమీపంలో బస్సుపైకెక్కి ప్రజలకు అభివాదం చేస్తూ యాత్రను సాగించారు. కాగా బస్సు యాత్రకు పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ బస్సు యాత్రకు ముందుండి పర్యవేక్షించారు.

ధాన్యం ధర.. ధమాల్

- దళారులంతా ఒక్కటై..
- పుట్టిపై ఏకంగా రూ.1500 తగ్గింపు
- గత్యంతరం లేక అమ్ముకుంటున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం

దళారులంతా ఏకమై ధాన్యం ధరలు తగ్గించారు. రబీలో సాగు చేసిన వరికి మంచి గిట్టుబాటు ధర వచ్చిందని రైతులు ఎంతో ఆనందపడ్డారు. వారి ఆనందాన్ని ఆవిరి చేస్తూ.. దళారులంతా ఏకమై ఒక్కసారిగా ధర తగ్గించారు. పుట్టి వడ్ల ధర రూ.16200 ఉండగా.. రూ.14700కు తగ్గించారు. దీంతో రైతు 8 బస్తాలు (పుట్టి) ధాన్యంపై ఏకంగా రూ.1500 నష్టపోతున్నారు.



రాశిగా పోసిన వరి ధాన్యం

చెన్నూరు, మార్చి 27: మండలంలో ప్రతి యేటా రబీలో కేసీ కాల్వ కింద రైతులు వరి సాగు చేస్తా రు. ఈ ఏడాది కాల్వకు నీరు రాకపోవడంతో తక్కువ శాతం వరి చేశారు. మండల వ్యాప్తంగా 1971 ఎకరాలలో అటు బోర్లు, ఇటు కాల్వల కింద వరి సాగు చేశారు. ఇందులో బోర్ల కింద 1800 ఎకరాలలో వరి సాగైంది. ఇక ఖరీఫ్‌లో సాగు చేసిన వరి దిగుబడి బాగా తగ్గడంతో రబీలో సాగైన వరికి డిమాండ్ పెరిగింది. నవంబరు చివరి నాటికి పుట్టి ధాన్యం ధర రూ.14000 వరకు ధర ఉండగా.. అమాంతం ధర పెరిగింది. రైతు కూడా పుట్టి ధాన్యం రూ.16వేలకు పైగా పలుకుతుందని ఊహించలేకపోయాడు. అయితే వారం కింద టి వరకు వరి కోతలు చేపట్టిన రైతులు కల్లాల్లోనే ధాన్యం అమ్మి రూ.16వేలతో సొమ్ము చేసుకున్నారు. అయితే ప్రస్తుతం దళారులు కుమ్మక్కై ధరను రోజురోజుకు తగ్గిస్తూ రూ.14700కు తగ్గించారు. వారం క్రితం వరకు పుట్టి ధాన్యం ధర రూ.16200 ఉండగా.. బుధవారం నాటికి ఏకంగా రూ.1500 తగ్గింది. దీంతో పుట్టి వడ్ల ధర రూ.14700కు దిగజారింది. దీంతో రైతులు ధాన్యం బయటకు తెచ్చి విక్రయించాలంటే ఖర్చులు ఎక్కువ కావడంతో పాటు ఆరుబయట ప్రదేశాల్లో ఆరబోయడంతో తేమ శాతం తగ్గి మరింత నష్టపోవాల్సి వస్తుంది. దీంతో రైతులు గత్యంతర లేక ఉన్న ధరకే అమ్ముకుంటున్నారు.



సంచుల్లో నింపుతున్న ధాన్యం



ఏం చేస్తాం..ఉన్న ధరకే అమ్ముకోవాల్సిందే..

పండించిన ధాన్యం దూర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకునే స్థోమత లేదు. ఏమున్నా పొలాల్లోనే విక్రయించాలి. ఈ మారు కాస్త పెరిగిన ధరతో ఆనందపడ్డాం. ఒక్కసారిగా దళారులు ఏకమై ధర తగ్గించారు. ఇంటికి తెచ్చి స్టాకు పెట్టాలంటే ఖర్చులు ఎక్కువ వస్తాయి. విధి లేని పరిస్థితిలో ఉన్న ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.

- పర్వతరెడ్డి, రైతు, శివాలపల్లె

అలా పెరిగితే.. ఇలా తగ్గించారు..

రైతులు ఏ పంట పండించినా గిట్టుబాట ధర లేదు. దళారులు ఏ ధర పెడితే ఆ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. పంట బాగా పండినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఖరీఫ్‌లో ధర పెరిగినపుడు దళారులు అప్పట్లో ధర తగ్గించాలని చూసినా కుదరలేదు. ఇప్పుడు ఏకంగా పుట్టి ధాన్యంపై రూ.1500 తగ్గించడం దారుణం. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనుకుంటే... పట్టించుకునే పరిస్థితి లేదు.

- కొండాల చెన్నయ్య, రైతు, చెన్నూరు




క్షయవ్యాధి అంతమే లక్ష్యం..

- క్రమబద్ధంగా మందులు వాడితేనే నివారణ
- డాట్ పరీక్షతో నిర్ధారణ
- నిర్ధారణతోనే రక్షణ

కడప (మారుతీనగర్) మార్చి 27: క్షయ ఒక అంటు వ్యాధి, ఈ వ్యాధి కేవలం గాలి ద్వారానే ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. గాలిని నియంత్రించడం సాధ్యమయ్యే పనికాదు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినపుడు, తుమ్మినపుడు నోరు, ముక్కుకు అడ్డంగా రుమాలు వంటివి పెట్టుకోవడం అలవరచుకోవాలి. లేదంటే ఆ వ్యాధిగ్రస్తుడు ఒక సంవత్సర కాలంలో 10 నుంచి 15 మందికి ఆ వ్యాధిని అంటించగలడు.

1962లో జాతీయ క్షయ నిరోధక కార్యక్రమం అమలు జరిగింది. అప్పట్లో ఆ కార్యక్రమం అనుకున్న సత్ఫలితాలను ఇవ్వలేదు. పైపెచ్చు గుర్తించిన బాధితులను ఒక ప్రదేశం (మదనపల్లి-ఆరోగ్యకేంద్రం) లో ప్రత్యేక వాతావరణంలో ఉంచేవారు. అప్పట్లో (రీఫాంపసిన్, ఇతాంబుటాల్, పైరాజినమైడ్, ఐసోనియాజెడ్)7 మాత్రలు చిన్నాపెద్దా అనే తేడా లేకుండా వేసుకోవాల్సి ఉండేది. ఆ మందుల ప్రభావం కారణంగా బాధి తులు చాలా ఇబ్బందులు పడి , మధ్యలోనే మందులను ఆపేసేవారు. ఈ పరిస్థితి దశల వారీగా సరిదిద్దిన జాతీయ క్షయ నిరోధక కార్యక్రమం మొదలు పెట్టుటకు దారితీసింది. ఈ కార్యక్రమంలో ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వల్పకాలిక చికిత్స (డీఓటీ ఎస్-డాట్స్)పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో రోగులను టెస్టింగ్ ద్వారా (గళ్ళపరీక్ష) త్వరితగతిన గుర్తించడం- గుర్తించిన వారికి అధునాతన మందులు ఇవ్వడం.. పేషెంట్ ఇంటి దగ్గరికి వెళ్ళి వారి కుటుంబ స్థితి గతులను పరిశీలించి, వారికి కూడా టెస్టింగ్‌తో పాటు, ఆ కుటుంబంలోని ఆరేళ్లలోపు పిల్లలకు కూడా మందులు ఇచ్చేవారు. దీంతో కొంతమేరకు వ్యాధిని నియంత్రించే దిశగా అడుగులు పడ్డాయి. 2018 నాటి నుంచి క్షయ వ్యాధిని పూర్తిగా లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు ముందుకేసింది. ఇందులో ప్రధానంగా అధునాతన టెస్టింగ్- (సీబీఎన్ఏఏటీ) క్యాటరైజ్డ్ బేసిడ్ ఆసిడ్ ఆంప్లిఫికేషన్ టెస్ట్)- ఆర్‌టీపీసీఆర్ -రియల్ టైమ్ పాలమోర్ చైన్ రియాక్షన్) యంత్రాల ద్వారా వ్యాధిని త్వరితగతిన గుర్తిస్తారు. వ్యాధి ముదిరిపోయినా కేవలం రెండు గంటల వ్యవధిలో ఈ పరీక్షల ద్వారా నిర్ధారణ సాధ్యమవుతుంది. వ్యాధిగ్రస్తుడి బరువును బట్టి మందులు అందించడంతో, ఆయా మందుల ద్వారా కలిగే పలు రకాల ఇబ్బందులు చాలావరకూ తగ్గాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులందరికీ గళ్ళ పరీక్షలు చేసి, వారికి కూడా బరువు ప్రకారం 6 నెలల మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీని వలన ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే శాతం తగ్గిపోతుంది.



క్రమ బద్ధంగా మందులు వాడితే నివారణ

క్షయ వ్యాధిగ్రస్తుడు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేసే 168 డోసుల మందులను వాడాల్సిఉంది. అలా వాడితే వంద శాతం క్షయవ్యాధి నయం అవుతుందది. ఒక వేళ సక్రమంగా వాడకపోతే వ్యాధి తిరగబడి మొండి (ఎం.డి.ఆర్) టీ.బీ.గా మారుతుంది. ఇందులో కొన్ని ప్రాణాంతకం కూడా అయ్యే అవకాశం ఉంది. ఆ మందుల ఖరీదు కూడా రమారమి 10 నుంచి 15 లక్షల విలువ వుంటుంది. కాగా ఆ మందుల వాడకం వలన కొంతమేర దుష్ఫలితాలు కూడా వుండే అవకాశాలున్నాయి. అయినప్పటికీ వైద్యుల సలహామేరకు ఇంటి దగ్గరకు వచ్చే నర్సులు- ఆశా వర్కర్లకు పేషెంట్స్ సహకారం తప్పనిసరి. సకాలంలో మొదట సూచించిన ప్రకారంగా మందులు వాడితే పరిస్థితి తీవ్రస్థాయికి చేరదు.

నిర్ధారణ పరీక్షలతోనే రక్షణ

క్షయ వ్యాధి ప్రధానంగా దురలవాట్లకు, హెచ్ఐవి (ఎయిడ్స్) డయాబెటిస్ (షుగర్) రక్తహీనత కలిగిన గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధుల, కార్మికులు, నిరక్షరాస్యులు, మురికి వాడల్లో వుండే వారు., వ్యాధి నిరోధక శక్తి లేని వారికి వచ్చే అవకాశాలున్నాయి. వీరితో పాటుగా పొగతాగేవారికి, మద్యం సేవించేవారికి, బీడీ కార్మికులకు, సున్నం, సిమెంట్, దుమ్ము, ధూళి వచ్చే ఫ్యాక్టరీలలో పనిచేసేవారికి పరస్త్రీ -పురుష లైంగిక సంపర్కం గల ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు వ్యాధి ఎక్కువగా సోకే వీలుంది. వీరంతా రెండు వారాలకు మించి ఎడతెరపి లేని దగ్గున్నా, సాయంకాలం పూట జ్వరం, ఛాతీలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఉమ్మి లేదా గళ్ళలో రక్తం పడడం తదితర లక్షణాలు కలిగిన వ్యక్తులు సరైన సమయంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోనట్లయితో వారి పరిస్థితి అధోగతే.

వంద శాతం మరణాలు లక్ష్యం



జిల్లాలో క్షయ వ్యాధి అంతమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. వ్యాధి బాధితులకు వెంటనే వైద్యం అందించడం, రాబోవు కాలంలో అడల్ట్ బీసీజీ అందించడం ద్వారా 2025 నాటికి వ్యాధిని పూర్తిగా నియంత్రించే వీలుంది. భారతదేశంలో 2018 నుంచి ప్రతీ సంవత్సరం సుమారు 27.09 లక్షల మంది కొత్తగా వ్యాధిబారిన పడుతుండగా, ప్రతి సంవత్సరం 4. 23 లక్షలు ప్రతి 3 నిమిషాలకు ఇద్దరు చొప్పును మృత్యుబారిన పడుతున్నట్లు గణాంకాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 78 వేల మంది క్షయవ్యాధి బాధితులను గుర్తించారు. మరణించే వారి సంఖ్య 4,500 దాకా ఉన్నట్లు సమాచారం. ఆ లెక్కన ప్రతి రెండు నిమిషాలకు ఒక్కరుగా గుర్తించారు. జిల్లా వారీగా ప్రతి సంవత్సరం రమారమి 6 వేల మంది వ్యాధిబారిన పడుతున్నారు. ఆ పరంపరలో 2022 నాటికి 4,682 మంది, 2023 నాటికి 4,348 మంది, 2024 మార్చి నాటికి 947 మంది ఉన్నట్లు గుర్తించారు. మరణాల శాతం 0. 5 గా వుంది. మరణాల శాతాన్ని 0 కి చేర్చడమే అంతిమ లక్ష్యం.

- సుబ్బరాయుడు, ఎస్‌టీఎస్ సూపర్‌వైజర్.


రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, మార్చి 27: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఈనెల 26న కడపలోని కడప స్పోర్ట్స్ పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ పవర్‌లిఫ్టింగ్ జిల్లా స్థాయి ట్రయల్స్‌లో అండర్-17, అండర్-19 విభాగంలో ముగ్గురు విద్యార్థినిలు, నలుగురు విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 30, 31 తేదీలలో విజయవాడలోని కృష్ణలంకలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో పాల్గొననున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

నేత్రపర్వంగా మాధవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దముడియం, మార్చి 27: మండల పరిధిలోని పెద పసుపులలో బుధవారం మాధవస్వామి రథోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, చెక్కభజన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేతుడై మాధవస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.. ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులరెడ్డి , దేవదాయశాఖ అధికారులు, పోలీసులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పుల్లారెడ్డి ఆహ్వానం మేరకు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి పూజలు చేశారు.

బి కొత్తకోట సరిహద్దులో రూ.3లక్షలు నగదు సీజ్

బి కొత్తకోట, మార్చి27: మండల పరిధిలోని రానామిట్ట చెక్‌పోస్టు వద్ద రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు నుంచి బి కొత్తకోట వైపు వస్తున్న ఓ కారులో సుదర్శన్‌రెడ్డి అను వ్యక్తి రూ.3 లక్షలు నగదు తీసుకొస్తున్నాడని, ఈ నగదుకు సంబంధించి సదరు వ్యక్తి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకొని రాయచోటిలోని ట్రెజరీలో జమచేశామన్నారు. బి కొత్తకోట బీసీ కాలనీలో షేక్ అలీసాబ్(55) ను అరెస్టు చేసి అతని నుంచి 1.08 లీటర్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలో వివిధ పాతకేసులలో ముద్దాయిలైన 10 మందిని డిప్యూటీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు తెలతిపారు. బి కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లికి చెందిన వివాహిత భువనేశ్వరి(19) అదృశ్యం అయిందని, ఈమెను అదే గ్రామానికి చెందిన వెంకి అనే వ్యక్తి తీసుకెళ్లి ఉంటాడని అనుమానం ఉన్నట్లు ఆమె తల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు గాయాలు

కురబలకోట, మార్చి 27: టెంపో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అన్నదమ్ములకు తీవ్రగాయాయ్యాయి. రాహూరివాండ్లపల్లె పంచాయతీ ఉప్పరోళ్ళపల్లెకు చెందిన ఇమ్మానుయేల్(37), రాజు(34) సీటీఎం నుంచి స్వగ్రామానికి వెళ్ళుతుండగా కంటేవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న టెంపో ఢీకొంది 108సాయంతోవారిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్సల నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక చైతన్యానికి మూలం నాటకం

- జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27 : వాస్తవ దృక్పథానికి, సాంఘిక చైతన్యానికి మూలం నాటకం అని, సమాజంలో ప్రతి సమస్యకు ప్రతిస్పందించి, ప్రతి సంఘటనను ప్రతిబింబించేది నాటకమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో రంగస్థల కళాకారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో నాటకం ఒక భాగమని, ఏ ప్రక్రియకు లేని గొప్పతనం నాటానికి ఉందని, అందరినీ ఆకట్టుకునే లలిత కళల సమ్మెళ్య స్వరూపం నాటకమన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వ వెంకటయ్య మాట్లాడుతూ నాటకం పురోగమించాలంటే ప్రతి యూనివర్సిటీలో రంగస్థల కళల విభాగం ఉండాలన్నారు. ఒకప్పుడు దేదీప్యమానంగా వెలిగిన నాటకం ఇప్పుడు వెలవెలబోతోందన్నారు. అనంతరం ప్రముఖ నటుడు, కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా జిల్లా రచయితల సంఘం జిల్లాలో ప్రసిద్ధులైన రంగస్థల కళాకారులు సుబ్బరామయ్య, రామనపల్లె శంకర్, ఎస్.సుబ్బరాయుడు, కె.ఓబులేసు, బాలఓబులయ్య, ఎం.చెన్నయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల మురళి, గంగయ్య, నారాయణ, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

మూల్యాంకన విధుల కేటాయింపుల్లో అవకతవకలు సరిచేయాలి

- ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27 : పదోతరగతి మూల్యాంకన విధుల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలను సరిచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఆర్జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ బాబునాయక్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి మూల్యాంకన విధులు కేటాయింపులను ఇష్టారాజ్యంగా తప్పులతడకగా రూపొందించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ ఉపాధ్యాయులను పక్కన బెట్టి పాఠశాల సహాయకుడిగా పదోన్నతి పొంది కనీసం ఏడాది కూడా పూర్తి కాని ఉపాధ్యాయులను విధులకు కేటాయించారన్నారు. ఏడాది క్రితం సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు సైతం మూల్యాంకన విధులు కేటాయించారంటే, విధుల కేటాయింపు ఎంత పారదర్శకంగా అమలు జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొంది ఆ వెంటనే రీ ప్యాట్రియేషన్ ద్వారా ఎస్‌జీటీగా వెళ్లిన ఉపాధ్యాయురాలికి సైతం విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు పంపారని ఆరోపించారు. కడప చింతకొమ్మదిన్నె మండలాల పరిధిలోని శాంతినగర్, నాగిరెడ్డిపల్లె మూలవంక ఉన్నత పాఠశాలలు గత ఏడాదే అప్‌గ్రేడ్ అయ్యాయన్నారు. కానీ ఆ పాఠశాలల ఉపాధ్యాయులను మూల్యాంకన విధులకు కేటాయించారన్నారు. అలాగే మరికొన్ని ఉదాహరణలు చూపించారు. తెలుగు మూల్యాంకనానికి సంబంధించి భాషోపాధ్యాయులుగా దీర్ఘకాలంగా పదో తరగతి బోధించిన అనుభవాన్ని పక్కనబెట్టి జూనియర్లకు మూల్యాంకన విధులు కేటాయించారని ఆరోపించారు. మూల్యాంకనం ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మూల్యాంకన విధుల కేటాయింపుల్లో జరిగిన తప్పులను అవకతవకలను సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ఎస్ఎజాజ్ అహ్మద్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఇదీ..జగన్ సొంత ఇలాకాలో ఇళ్ల తీరు...!

- మంజూరు చేసిన ఇళ్లు 7079
- పూర్తయినవి 310.. చేరినవి 0
- కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 27: పులివెందుల నియోజకవర్గం ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గం. పులివెందుల పట్టణం జగన్ సొంత పట్టణం. పులివెందుల పట్టణంలో జగనన్న ఇళ్ల కాలనీ పేరుతో 7079 ఇళ్లు జగన్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికి 310 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. అందులో ఒక్కరు చేరలేదు. జగన్ అసమర్థ పాలనకు ఇంత కంటే నిదర్శనం కావాలా అని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడి యా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంలోనే ఇంత అధ్వాన్నంగా ఉంటే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో ఆలోచించాలని తులసిరెడ్డి ప్రజలను కోరారు. వేంపల్లె పట్టణంలో ప్రతిరోజు దుమ్ము తుఫాన్లు వస్తుంటాయన్నారు. రోడ్ల విస్తరణ పేరుతో సంవత్సరం కిందట వేంపల్లెను శిథిల వేంపల్లెగా ప్రభుత్వం మార్చిందన్నారు. వైసీపీ సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా బస్సుయాత్ర సాగే మార్గంలో రోడ్లపై దుమ్ము లేయకుండా ట్యాంకర్లతో నీళ్లు చల్లారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఎక్కడ చూసిన మురికినీటి కుంటలే దర్శనమిస్తున్నాయన్నారు. వేంపల్లె-రాయచోటి రోడ్డు విస్తరణ పేరుతో ఉన్న రోడ్డును తవ్వారు. కొత్త రోడ్డు వేయలేదు, రెండు సంవత్సరాల నుంచి ప్రయాణికులు నరకం చూస్తున్నారని తెలిపారు. అలాగే పులివెందుల నియోజకవర్గం అసాంఘిక శక్తుల అడ్డాగా తయారైందన్నారు. మద్యం ఏరులై పారుతోందన్నారు. జూదం విచ్చలవిడి అయిందని, మట్కా, బెట్టింగుల నిలయమైందన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు.



వేంపల్లెలో రోడ్లను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

నీరుగారిన వైసీపీ కార్యకర్తల ఉత్సాహం

- బస్సుపై నుంచే అభివాదం చేస్తూ వెళ్లిపోయిన జగన్

ఎర్రగుంట్ల, మార్చి 27: జగన్‌మోహన్‌రెడ్డి రాకకోసం గంటలకొద్దీ వేచి చూసిన కార్యకర్తల ఉత్సాహం.. ఆయన బస్సుపై నుంచే అభివాదం చేస్తూ వెళ్లిపోవడంతో నీరుగారిపోయింది. బస్సు యాత్రలో బాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సాయంత్రం వేంపల్లి నుంచి ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరు సభలో పాల్గొనేందుకు వెళ్లారు. ఎర్రగుంట్ల శివారు నుంచి జగన్‌ను చూసేందుకు స్వాగతించేందుకు అభిమానులు కార్యకర్తలు తరలివెళ్లారు. అయితే, జగన్ రాక ఆలస్యం కావడంతో కార్యకర్తలు కొద్దిగా అసహనానికి గురైనా, నాలుగు రోడ్ల వద్ద జగన్ వచ్చేంత వరకు వేచి చూశారు. జగన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని అభిమానులు కార్యకర్తలు ఆశించారు. అయితే ఆద్యంతం ఆయన బస్సు పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లడంతో కార్యకర్తలు నిరుత్సాహపడ్డారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద ముందుగా జనం లేకపోయినా జగన్ వచ్చే సరికి ఒక్కసారిగా అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. జగన్ వాహనం నెమ్మదిగా కదులుతూ పోట్లదుర్తి మీదుగా ప్రొద్దుటూరు సభకు వెళ్లింది. జగన్ వెంట పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మూలే సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బస్సుపైనుంచి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి. భార్యకు గాయాలు

రాజంపేట టౌన్, మార్చి 27: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని భార్య కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కొల్లావారిపల్లె పంచాయతీ గోపమాంబ పురం వడ్డిపల్లెకు చెందిన బుర్సు హరికృష్ణ (24), చిట్వేలి మండలం వడ్డిపల్లెకు చెందిన శ్రీలేఖతో 5 నెలల క్రితం వివాహం జరిగింది. శ్రీలేఖ తండ్రి కువైత్‌కు వెళుతున్న సందర్భంగా వారు మంగళవారం ఉదయం వడ్డిపల్లెకు బైక్‌పై వెళ్లి వస్తూ, ఊటుకూరు సమీపంలోని అశోక్ గార్డెన్స్ వద్ద కడప నుండి తిరుపతికి వెళుతున్న లారీని వేగంగా ఢీకొన్నారు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో హరికృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య శ్రీలేఖ రోడ్డు పక్కన గాయాలతో పడి ఉండటం గమనించిన స్థానికులు 108 వాహనంలో రాజంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజంపేట మన్నూరు పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన శ్రీలేఖ మూడు నెలల గర్భిణి





మృతిచెందిన హరికృష్ణ (ఇన్‌సర్ట్) గాయపడిన శ్రీలేఖ

తాగునీటి కోసం వెళ్లి.. గుండెపోటుతో మహిళ మృతి

మైదుకూరు రూరల్ మార్చి 27 : తాగునీరు తెచ్చుకోవడానికి ట్యాంకరు వద్దకు వెళ్లిన ఓ మహిళ, ఇంటికి రాగానే కింద పడిపోయి ప్రాణాలు వదిలింది. మైదుకూరు పట్టణంలో బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా... పట్టణంలోని 12వ వార్డుకు చెందిన షేక్ బాను (37) రెండేళ్లుగా ముగ్గురు పిల్లలతో కలసి భర్తకు దూరంగా ఉంటోంది. కూలి పనులు చేసు కుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం ట్యాంకర్ వద్దకు వెళ్లి బిందెతో నీరు పట్టుకుని ఇంటికి వచ్చింది. ఉన్న ట్లుండి కిందపడి ప్రాణాలు కోల్పోయింది. కాగా, ఆమె గుండెపోటుతో మరణించి ఉండవచ్చని బంధువులు తెలిపారు. దీంతో ఆమె ముగ్గురు పిల్లలు ఇర్ఫాన్, మస్తాన్, చాను అనాథలుగా మారారు. కాగా, తాగునీటి సరఫరా విషయంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యమే ఆమె మరణానికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తల్లి మృతదేహం వద్ద విలపిస్తున్న చిన్నారులు

పట్టపగలే రెండు ఇళ్లల్లో చోరీ

రాజంపేట టౌన్, మార్చి 27: పట్టణంలోని బలిజపల్లెలో బుధవారం పట్టపగలే రెండు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. స్థానిక బలిజపల్లెలో నివసించే చంద్రకళ ఇంటికి తాళం వేసి బెంగుళూరులోని కూతురి వద్దకు వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన యశోదమ్మ ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లింది. ఈ రెండు ఇళ్లకు తాళాలు వేసిన విషయం గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి, ఇళ్ల లోకి ప్రవేశించారు. బీరువాలు, ర్యాక్‌లలోని బట్టలు చెల్లాచెదురు నగలు,నగదు అపహరించుకు వెళ్లా రు.. కాగా, చోరీ విషయం బంధువుల ద్వారా తెలుసుకున్న యశోదమ్మ తన ఇంటిలో 60 గ్రాముల బంగారు, కొద్దిపాటి నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫోన్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. చంద్రకళ అందుబాటులో లేకపోవడంతో చోరీ సొమ్ము వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



చోరీకి గురైన బీరువా

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి మృతి

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 27: మండలంలోని శెట్టిగుంట పంచాయతీ మారివారిపల్లె ప్రధాన రహదారి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి సయ్యద్ సాహిల్(16) వేలూరు సీఎంసీ ఆసుపత్రితో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోడూరు సీఐ టి.బాబు తెలిపారు. మృతదేహానికి కోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి అబ్దుల్ సలామ్ ఉపాధి కోసం గల్ఫ్ దేశాల్లో ఉన్నాడు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే భారతదేశానికి తిరిగి వచ్చాడు. సాహిల్ మృతితో పెద్దపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



సాహిల్ మృతదేహం

ఎడారిగా మారిన రాష్ట్రం: వైసీపీ

కడప (నాగరాజుపేట), మార్చి 27:రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎడారిగా మార్చిందని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం తమ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వం రాయలసీమ ప్రాంతాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే ఎడారిగా మార్చి శ్మశానంగా తయారు చేసిందన్నారు. నిత్యం కరువులతో వలసలు, ఆత్మహత్యలు, నిరుద్యోగ సమస్యలతో రాష్ట్రం అట్టుడికిపోతోందన్నారు. భవిష్యత్ కార్యాచరణను రాష్ట్ర కమిటీ చర్చించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు లింగమూర్తి, రాయలసీమ జిల్లా ప్రతినిధులు మగ్బుల్‌బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ కాన్వకేషన్‌కు దరఖాస్తుల వెల్లువ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27 : యోగివేమన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొందడానికి దరఖాస్తు గడువును ఈ నెల 30కి ముగియనుండటంతో దరఖాస్తు చేసేందుకు వచ్చిన విద్యార్థులతో విశ్వవిద్యాలయంలో సందడి నెలకొంది. విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థుల సౌకర్యార్థం పలు విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటిదాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 10,682 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు.

మెడిసిన్ విద్యార్థికి బాసట సంస్థ సాయం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27 : మెడిసిన్ విద్యార్థికి కడప నగరం బాసట స్వచ్ఛంద సేవా సంస్థ వారు బుధవారం ఆర్థిక సాయం అందించారు. కడపకు చెందిన లోకేశ్ రేణిగుంట బాలాజీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆ విద్యార్థి తల్లి బాసట సంస్థ సభ్యుడైన కార్తీక్‌రెడ్డికి తెలుపగా ఆయన దాత ద్వారా రూ.10 వేలు, మరో యువ డాక్టరు రితేష్ రూ.5వేలు కలిపి రూ. 15వేలు నగదును ఆ విద్యార్థి తల్లికి అందించారు. ఈ సందర్భంగా బాసట అధ్యక్షుడు ఎం.బాలాజీరావు మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు బాసట తమ వంతు సహకారం అందిస్తుందని తెలిపారు.

నన్ను పట్టించుకోండి సారూ..?

చెన్నూరు, మార్చి 27:మండల కేంద్రమైన చెన్నూరులోని కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు రేయింబవల్లు వెలుగుతూనే ఉంటాయి. పగలు కూడా లైట్లు వెలుగుతుండడంతో ప్రజలు మాకేమన్నా పగటిపూట కూడా కళ్లు కానరావా, లైట్లు వెలిగితేనే మేం తిరుగుతామా.. అనుకుంటూ వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు. వీధిలైట్లు తెల్లారాక కూడా వెలుగుతుండడంతో పంచాయతీ, విద్యుత్ శాకాధికారులపై విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే విద్యుత్ కోతల కాలం. ఇలాంటి సమయంలో విద్యుత్ ఆదా చేయాల్సిన అవసరం అధికారులకు లేదా, వీధిలైట్లు ఎంతసేపు, పగలైతే రాత్రి అయితే వెలిగితేనేమి అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆ బిల్లుల ఖర్చు ప్రజలపైనే కదా పడేది అంటూ ప్రశ్నిస్తున్నారు. అలా కాకుండా పగలు ఆర్పివేసి రాత్రిపూట వెలిగించి కాసింత ఖర్చు తగ్గించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం మీ విధులు పూర్తియిన తరువాత బయటికి వెళ్లే ముందు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేసి వెళ్లండి అనే బోర్డులు పెట్టే అధికారులు ఇలా గ్రామీణ ప్రాంతాల్లో పగటిపూట కూడా లైట్లు వెలుగుతుంటే ఏం చేస్తున్నారని, తనను పట్టించుకోవాలని వీధి లైటు కోరుతోంది.



చెన్నూరు బస్టాండులో నిరంతరాయంగా వెలుగుతున్న లైటు

ప్రజల పైనే కదా భారం పడేది

విద్యుత్ శాఖ గత కొద్దినెలలుగా గ్రామ పంచాయతీ నుంచి ప్రతి యేటా బిల్లులు గట్టిగా వసూలు చేస్తుంటుంది. కాగా వీధి లైట్ల డబ్బు కూడా పరోక్షంగా ప్రజలే చెల్లించాలి. కావున ఇలా వృథాగా రేయింబవళ్లు కాకుండా రాత్రి మాత్రమే లైట్లు వెలిగిస్తే ప్రజలకు విద్యుత్ భారం తగ్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– షబ్బీర్ హుసేన్, చెన్నూరు

ముతుకూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

వేంపల్లె, మార్చి 27: మండలంలోని ముతుకూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సాయిరామిరెడ్డి, మాధవరెడ్డి, దివాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సాంబశివారెడ్డి, సాయితులసిరెడ్డి, పాపిరెడ్డి, శివారెడ్డి, చినరెడ్డి తదితర పలు కుటుంబాల వారికి టీడీపీ కండువా వేసి బీటెక్ రవి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి సమిష్టి కృషిచేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముతుకూరులో బీటెక్ రవి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న దృశ్యం

టీడీపీని ఆదరించి సూపర్‌సిక్స్ పథకాలు అందుకోండి





వల్లూరు: మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి... చెన్నూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

వల్లూరు, మార్చి 27 :టీడీపీని ఆదరించి సూపర్‌సిక్స్ పథకాలు అందుకోవాలని టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మీ భవిష్యత్తు మేం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల పరిధిలోని అంబవరం గ్రామంలో పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డితో కలిసి చేపట్టార. ఈ సందర్భంగా వారు ఇంటికికీ వెళ్లి టీడీపీ వస్తే కొనసాగించే సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. ఈ ఐదేళ్లూ జగన్ నిరంకుశ పరిపాలన కొనసాగిందని, కేవలం ధనార్జన, స్వలాభం కోసమే పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, నల్లపురెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, ఎం.శివారెడ్డి మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి వెంకటరమణ, ఓబుల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాఘవరెడ్డి, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

చెన్నూరులో ఇంటింటి ప్రచారం: తెలుగుదేశం పార్టీని ఆదరించి సూపర్‌సిక్స్ పథకాలు అందుకుని అభివృద్ధిపథంలో సాగాలని చెన్నూరు టీడీపీ అధికార ప్రతినిధి జడా లక్ష్మీనారాయణ, కార్యదర్శి అతికారి విశ్వం పేర్కొన్నారు. చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతంలో వారు ఇంటింటి ప్రచారం చేపట్టారు.



ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు ష్యూరిటీ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 27: ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు షూరిటీ అని టీడీపీ కడప నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరంలోని 12వ డివిజన్ గురుకుల్ విద్యాపీఠ్ ప్రాంతంలో కడప నియోజకవర్గం టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్ర మంలో భాగంగా గపడ గడపకు వెళ్లి టీడీపీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించి పలువురు డివిజన్ వాసులను టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సానపురెడ్డి శివకొండారెడ్డి, జయరాం, జియావుద్దీన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రముఖ శల్యవైద్యుడు టీడీపీలో చేరిక

కమలాపురం రూరల్, మార్చి 27 : కమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ శల్య వైద్యుడు పాలగిరి సుబ్బారెడ్డి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు పుత్తా పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాలగిరి సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పుత్తా విజయానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా, వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, గొల్ల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి తదితరులు



ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 27 : విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో బుధవారం జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిలా లక్షలాది మంది అభిమానులను సొంతం చేసుకోవడంలో ఆయనకు చాటి ఎవరూ లేరన్నారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కోరారు. రామ్‌చరణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు, తిరుమలయ్య తోట సుమన్, ప్రసాద్, గనేశ్, అంజి, హరి, సాయి, కిరణ్, ప్రకాశ్, చెంగయ్య, శ్రీనో, కుమార్, సూరి, కొండయ్య, వెంకటేశ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకుడు తుంగా రమణయ్య తదితరులు

సురభి వారసత్వాన్ని కొనసాగించేందుకు కృషి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27: ప్రపంచ స్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్టలు సాధించి పెట్టిన సురభి నాటక సంస్థ వారసత్వాన్ని జిల్లాలో కొనసాగించేందుకు ఇంటాక్ పక్షాన కృషి చేస్తామని సంస్థ జిల్లా కన్వీనరు కె.చిన్నపరెడ్డి అన్నారు. ప్రపంచ నాటక రంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ఇంటాక్ కార్యాలయంలో జిల్లాకు చెందిన ప్రముఖ నాటక సంస్థ సావేరా నాయకుడు ఆళ్లూరు వెంకటయ్య, ఇతర సభ్యులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏటా ప్రపంచ నాటక రంగ దినోత్సవ సందర్భంగా ప్రజలనుంచి సమాజానికి తెలియజేయాల్సిన సమస్యలు వాటి పరిష్కారానికి నాటక రంగం ద్వారా చేయాల్సిన కృషి గురించి చర్చిస్తారని తెలిపారు. సురభి నాటకరంగం మన జిల్లాకు చెందినది కావడం నాటకానికి మాతృ సంస్థగా నిలవడం ప్రపంచ స్థాయిలో పేరు ప్రతిష్టలు సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఆళ్లూరు వెంకటయ్య సావేరా సంస్థ ద్వారా రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ జిల్లాకు చెందిన ఇతర నటీనటులు సాకారంతో ఇప్పటికీ 27 రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులను సాధించడం అరుదైన ఘనతగా చెప్పుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సావేరా వెంకటయ్యను ఆయన సహచర నటులను ఇంటాక్ ప్రతినిధి బృందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ ప్రతినిధులు అనంతమ్మ, నాగవేణి, అరుణ, గంగాధర, గురుమోహన్, వెంకటసుబ్బయ్య, వర్మ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

కార్పొరేట్ విద్యాసంస్థలను బహిష్కరించండి: పీడీఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27 : ర్యాంకులు, ఫీజులతో విద్యార్థులను శవాలుగా మారుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను బహిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి త్రినాథ్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలల్లో ప్రతి ఏటా 90 నుంచి వంద మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కార్పొరేట్ పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేయడమే దీనికి కారణమన్నారు. ఇటువంటి బలవన్మరణాలకు కారణమవుతున్న కార్పొరేట్ పాఠశాలల్లో చేరవద్దని విద్యార్థులకు సూచించారు. పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, విఘ్నేష్, శ్రీనివాసులరెడ్డి, అల్లాబకాష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు కరపత్రాలు అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వికలాంగుల పోరాటానికి సీపీఐ మద్దతు

● జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 27: బద్వేలులో వికలాంగుల భూపోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. బుధవారం కడపలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీకి తలొగ్గి వికలాంగులు అని చూడకుండా గుడిసెలు కాల్చి వేయించిన బద్వేలు ఆర్డీఓపై హెచ్‌ఆర్‌సీ లోకాయుక్త, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బద్వేలు పట్టణంలో సర్వే నెం.941లో ఇల్లు లేని నిరుపేదలైన వికలాంగులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ సచివాలయాల చుట్టూ ఆర్డీఓ ఆఫీసు చుట్టూ తిరిగి అప్లికేషన్ పెట్టి బద్వేలు పట్టణంలోని టిడ్కో ఇళ్లకు కేటాయించిన స్థలంలో ఈ నెల 15న గుడిసెలు వేసుకున్నారన్నారు. అయితే ఆ గుడిసెలకు ఎదురుగా ఉన్న నోబుల్ శంకర్‌రెడ్డి అనే వ్యక్తి అధికార పార్టీ అండదండలతో అధికారులకు డబ్బు ఎరచూపి పోలీసులను పురమాయించి వికలాంగులు నిర్మించుకున్న గుడిసెలను అర్ధరాత్రి ధ్వంసం చేయించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే వికలాంగులకు న్యాయం చేయాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, వీరశేఖర్, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

జగన్ సర్కారు ధారాదత్తం చేసిన భూములను వెనక్కి తీసుకోవాలి

● డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు

కడప(కలెక్టరేట్), మార్చి 27:ఎన్నికల షెడ్యూల్ విడుదల తేదీకి ముందు రోజున వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు జగన్ సర్కారు ధారాదత్తం చేసిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. బుధవారం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి బీసీలకు అధ్యక్ష పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి జిల్లా పర్యటన అనివార్య కారణాల వల్ల 28వ తేదీన రద్దు చేశారని, ఏప్రిల్ 1వ తేదీన కడపలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.




మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు

నేటి నుంచి పాలీసెట్ ఉచిత శిక్షణా తరగతులు

సింహాద్రిపురం, మార్చి 27: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు ర్యాంక్ సాధించేందుకు ఉపయోగపడేలా సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి పాలీసెట్‌పై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె. తాతాజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. 29 ఉదయం 9-30 గంటల నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు.

లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

పులివెందుల టౌన్, మార్చి 27: ఇప్పట్ల సమీపంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. బుధవారం కొడిదల హుస్సేనమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా ఆమె కొడుకు రిటైర్డ్ తహసీల్దార్ కుళాయప్ప, కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా మాతృమూర్తి హుస్సేనమ్మ జ్ఞాపకార్థంగా ఈ సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఏదో ఒక స్వచ్ఛంద కార్యక్రమాన్ని, తన కార్యక్రమాలు ఏర్పాటుచేయబోతున్నట్లు కూడా ఆయన తెలిపారు.





అప్పు విషయమై ఇరువురి మధ్య తోపులాట

కడప (క్రైం), మార్చి 27 : కడప నగరంలోని నబీకోట్ రోడ్డుపై అప్పు విషయమై ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. కడప నబీకోట ప్రాంతానికి చెందిన ఇరువురు అప్పు విషయమై మాట మాట పెరిగి తోపులాట వరకు వెళ్లింది. ఈ ఘటన నడిరోడ్డుపై జరగడంతో వాహనాలు భారీగా నిలిచాయి. దీంతో స్థానికులు కలగజేసుకుని వారిరువురినీ విడిపించి అక్కడి నుంచి పంపించారు. తాలుకా పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

సీకేదిన్నె, మార్చి 27: భార్య దూరబోయిన వెంకటలక్ష్మిని భర్త లక్ష్మయ్య కత్తితో పొడిచిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. సీకేదిన్నె మండలం కార్పొరేషన్ పరిధిలోని అంగ డివీధిలో నివాసం ఉంటున్న లక్ష్మయ్య ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. దీంతో భార్య వెంకటలక్ష్మి మందలించడంతో మద్యం మత్తులో ఉన్న లక్ష్మయ్య ఆమెపై కత్తితో దాడి చేశాడు. దీంతో వెంకటలక్ష్మి చికిత్స ని మిత్తం తన కుమారుడు, స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. భర్త పరారీలో ఉన్నట్లు తెలిసింది.

నేటి నుంచి క్రైస్తవ పవిత్ర దినాలు

కడప (కల్చరల్), మార్చి 27: క్రైస్తవ పవిత్ర దినాలను ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు ప్రారంభించనున్నామని సెయింట్ జాన్ చర్చి మాసాపేట విచారణ గురువు ఫాదర్ గుడిమే దేవసహాయం కోరారు. బుధవారం స్థానిక మాసాపేటలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొండాపురం, మార్చి 27 : పి.అనంతపురం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పి.అనంతపురం గ్రామానికి చెందిన రామకృష్ణ టీవీఎస్ మోపెడ్‌లో ఇంటికి వెళుతుండగా తాడిపత్రి వైపు గ్యాస్‌లోడుతో వెళుతున్న లారీ ఢీ కొన్నట్లు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు.



చేనేతల ఆత్మహత్యలపై న్యాయవిచారణ జరిపించాలి

జమ్మలమడుగు, మార్చి 27: జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలోని ఏవో వెంకటలక్షుమ్మకు చేనేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవరం చేనేతల ఆత్మహత్యలపై కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుడు భూ సమస్య కారణంగా ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నవారిపై వెంటనే విచారణ జరిపించాలన్నారు. ఆత్మహత్యలకు కారకులైనవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు శివనారాయణ, పల్లా లక్ష్మీనారాయణ, గంగాధర్, సూర్యనారాయణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టా సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక



మైదుకూరు...పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన గడ్డంవారిపల్లె వైసీపీ నాయకులు

మైదుకూరు రూరల్ మార్చి 27 : రానున్న ఎన్నికల్లో మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గెలిపించుకొంటామని గడ్డంవారిపల్లె, వనిపెంట ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులోని గడ్డంవారిపల్లెలో దండు రామకృష్ణ, దండు లక్ష్మమ్మ,మాజీ సర్పంచ్ వై.వెంకటేష్ వారి అనుచర వర్గం సుమారు 40 కుటుంబాలు పుట్టా సమక్షంలో టీడీపీ కండువాలను కప్పుకొన్నారు. అలాగే ప్రొద్దుటూరులో టీడీపీ ఆఫీసులో వనిపెంట ఎస్సీ కాలనీకి చెంది న క్రైపు రాజు,ధనుంజయ్,బండయ్య,బాబు,మునెళ్ల రాజులతో పాటు 40 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య, పందిటి మల్లోత్ర,ధనపాల జగన్,మాజీ సర్పంచ్ టీఎస్ శ్రీనివాసులు, మాజీ మార్కెట్ క మిటీ చైర్మెన్ టీఎన్ శ్రీనివాసులు,కటారి క్రిష్ణ,ఆకుల క్రిష్ణయ్య,నేట్లపల్లి మల్లికార్జున్‌యాదవ్,రఫీ,టీపీ సుధాకర్, లక్ష్మీనారాయణ, ధనపాల రవి,పాలమాబు తదితరులు పాల్గొన్నారు.

రేకలకుంట్లలో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 : బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల గ్రామ వాసులు మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. రేకలకుంట్ల గ్రామానికి చెందిన గుజ్జు రామాంజనేయులు, పెద్దపోతు బుజ్జి, వెంకటస్వామినాయుడు, గుజ్జు రామా, పెద్దపోతు శివ వారి ఆధ్వర్యంలో వారి అనుచరులు 50 కుటుబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ప్రొద్దుటూరులోని పుట్టా సుధాకర్‌యాదవ్ నివాసం వద్ద టీడీపీలో చేరారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సోమిరెడ్డిపల్లె యూనిట్ ఇన్‌ఛార్జ్ సాంబశివారెడ్డి, శివ, రమణారెడ్డి పాల్గొన్నారు.

పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గెలిపించుకొంటాం

మైదుకూరు రూరల్ మార్చి 27 : ప్రొద్దుటూరులోని పార్టీ ఆఫీసు లో బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను కలిసి తమ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర,చెన్నయ్య,జీవన్,సుబ్బారావు,సుబ్బయ్య, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

30న చలో గుంటూరును జయప్రదం చేయండి

జమ్మలమడుగు, మార్చి 27: ఈనెల 30వ తేదీ హాలో మాదిగ చలో గుంటూరు కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని జమ్మలమడుగు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్యమాదిగ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో చలో గుంటూరు కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

బద్వేలు రూరల్, మార్చి 27 : పట్టణంలోని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి ధృవీకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేశ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోంలో సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధరణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు చేపడ తామన్నారు. ఈ కార్యక్రమంలో రేడియాలజిస్ట్ డాక్టర్ రామక్రిష్ణరెడ్డి, గైనకాలజిస్ట్ రామలక్షుమ్మ, తొట్టిగారిపల్లె ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్, శరత్‌చంద్ర, సౌమ్య, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య పాల్గొన్నారు.

నేడు పలుగురాళ్లపల్లెలో
'భవిష్యత్తు గ్యారంటీ'

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 : బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీలో గురువారం సాయంత్రం 3గంటలకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం, అలాగే వైసీపీ నుంచి టీడీపీలో చేరడం ఉంటుందని టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి బి.మఠం మండలంలోని టీడీపీ నాయ కులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొండాపురం, మార్చి 27 : మండలంలోని పి.అనంతపురం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పి.అనంతపురం గ్రామానికి చెందిన రామకృష్ణ టీవీఎస్ మోపెడ్‌లో ఇంటికి వెళుతుండగా తాడిపత్రి వైపు గ్యాస్‌లోడుతో వెళుతున్న లారీ ఢీ కొన్నట్లు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు.దీంతో తీవ్ర గాయాలైన ఇతనిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి

కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బాలక్రిష్ణ

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 : రైతులు రసాయనిక ఎరువులను పక్కనబెట్టి సొంతంగా తయారు చేసుకునే సేంద్రియ ఎరువులు వాడాలని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బాలక్రిష్ణ పేర్కొన్నారు. బుధవారం బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు సేంద్రియ ఎరువులు తయారు చేసేవిధానం, ప్రకృతి వ్యవసాయం చేసే విధానంపై సొంతంగా తయారు చేసే ఎరువులపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ బ్రహ్మంగారిమఠం రైతు ఉత్పత్తిదారులసంఘం సభ్యులు, అకౌంటెంట్ వెంకటరత్నం, రైతులు పాల్గొన్నారు.

చోరీ బంగారం రికవరీ

ముద్దనూరు, మార్చి 27: స్థానిక పులివెందుల రోడ్డు సమీపంలోని పాలగిరి విశ్వనాథ ఆచారి ఇంటిలో జరిగిన చోరికి సంబంధించి బుధవారం బంగారం రికవరీ చేసి కోర్టులో అప్పగించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన జరిగిన చోరీకి సంబంధించి సత్యసాయి జిల్లా కదిరికి చెందిన యనమల అంజనేయులు నుంచి సుమారు 18.5 తులాల బంగారు రికవరీ చేసి కోర్టులో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

పెద్దముడియం, మార్చి 27 : ప్రజలకు హక్కు పొందడం, వినియోగం పై మండల వ్యాప్తంగా బుధవారం స్వీప్ అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఓటు హక్కు గురించి తెలిపేలా ముగ్గుల పోటీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో లక్ష్మీనరసింహ, తహసీల్దారు రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్‌లెవల్ అధికారులకు సలహాలు సూచనలు..: తహసీల్దారు కార్యాలయంలో బుధవారం బూత్‌లెవల్ అధికారులకు సమావేశం నిర్వహించారు. తహసీల్దారు రవికుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. బూత్‌స్థాయి అవగాహన కమిటీ సభ్యుల బాధ్యతలు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సమావేశంలో సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనరసింహ, డీటీ గౌషియా, వీఏవోలు పాల్గొన్నారు.

ఖాజీపేట..: విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సాహిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ఎస్‌వీఈఈపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వికలాంగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు

బద్వేలు, మార్చి 27: పట్టణంలో అర్హులైన వికలాంగులు పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో టిడ్కో ఇళ్లకు కేటాయించి స్థలంలో గుడిసెలు వేసుకున్నారన్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల అధినేత శంకర్‌రెడ్డి అనే వ్యక్తి అధికార పార్టీ అండదండలతో వికలాంగులు వేసుకున్న గుడిసెలు తొలగించేలా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. శంకర్‌రెడ్డికి 952 సర్వేనెంబరులో 49,50 ప్లాట్లలో నకిలీ పట్టాలు సృష్టించుకుని పెద్ద భవంతిని ఏర్పాటు చేసుకున్నారన్నారు. అలాగే పలు నకిలీ పట్టాలతో ప్లాట్లను ఆక్రమించుకున్నారని, ఇలా పలు అక్రమాలకు పాల్పడుతున్నఅతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కారవ్యర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, వీరశేఖర్, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 : ప్రముఖ పుణ్యక్షేత్రం కాలజ్ఞాన కర్త శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం సముదాయంలోని కనుమ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో వాటర్‌ట్యాంకును ప్రారంభించారు. బుధవారం ఆయన పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ఆవరణలోని ఇటీవల రూ.13లక్షల వ్యయంతో తాగునీటి వాటర్ ట్యాంకును సొంత నిధులతో దాత శ్రీకాంత్‌రెడ్డి నిర్మించి దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనరు, మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరయ్యఆచారి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత శ్రీకాంత్‌రెడ్డిని ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాబవు రోజుల్లో ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సరస్వతి, జ్యోతి తదితరులు

జమ్మలమడుగు, మార్చి 27: చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతి తెలిపారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బీసీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఓటర్ల వద్దకు వెళ్లి ఈసారి టీడీపీని ఆదరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, మునెమ్మ, దేవమ్మ, నారాయణమ్మ, యాస్మిన్, మరియమ్మ, కుమారి, జయమ్మ, బికారి, నాగరాజు, రామచంద్ర, అనిల్‌కుమార్, మహేంద్ర, దాదాపీర్, ప్రసాద్, చంద్రశేఖర్, రమణ, గైబు, తదితరులు పాల్గొన్నారు.

పందుల బెడదతో ప్రజలకు ఇబ్బందులు



జమ్మలమడుగు, మార్చి 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పందుల బెడద అధికంగా ఉంది. అలాగే మండలంలోని గూడెం చెరువు, రాజీవ్‌నగర్ కాలనీ తదితర వీధుల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రస్తుతం రోడ్ల పక్కన పందులు అధికంగా ఉండడంతో చిన్నపిల్లలు రోడ్డుపైకి రావాలన్నా భయపడుతున్నారు. తిరుబండారాలు తీసుకెళ్లేటప్పుడు పందులు దాడి చేస్తున్నట్లుగా పలువురు తెలియజేశారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సులు లేక ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు



మైదుకూరు రూరల్ మార్చి 27 : మైదుకూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో బుధవారం బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు మైదుకూరు డిపో నుంచి బస్సులు చాలక తిరుపతి నుంచి బస్సులు తెప్పించారు.డిపోలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పల్లెవెలుగు బస్సులు ఎక్కాల్సిన ప్రయాణికులు హైటెక్ బస్సుల కోసం ఎగబడ్డారు. స్టాండ్‌కు బస్సు రాగానే గుంపులు,గుంపులుగా చుట్టుముట్టారు.

జగన్ సర్కారు ధారాదత్తం చేసిన భూములను వెనక్కి తీసుకోవాలి

● డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు




మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు

కడప(కలెక్టరేట్), మార్చి 27:ఎన్నికల షెడ్యూల్ విడుదల తేదీకి ముందు రోజున వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు జగన్ సర్కారు ధారాదత్తం చేసిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. బుధవారం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి బీసీలకు అధ్యక్ష పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి జిల్లా పర్యటన అనివార్య కారణాల వల్ల 28వ తేదీన రద్దు చేశారని, ఏప్రిల్ 1వ తేదీన కడపలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అలీఖాన్ పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకునేదెన్నడో..?





నెర్రలు చీలిన గోడలు

జమ్మలమడుగు, మార్చి 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో ఎంఈవో కార్యాలయ భవనాలు పైకప్పు, చుట్టూ గోడలు నెర్రలు చీలాయి. కార్యాలయ సిబ్బంది నెర్రలు చీలిన భవనంలో భయం భయంగా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో పైకప్పు భవనం ఉరుస్తుండడం వలన భవనాలు దెబ్బతిన్నాయి. 2024 విద్యాసంవత్సరంలో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసే నోట్‌పుస్తకాలు, టెక్స్ పుస్తకాలు దెబ్బతినే అవకాశం ఉంది. సమస్య ఉన్నప్పటికీ అక్కడి అధికారులు ఆ సమస్యను ఎవరికీ వివరించరనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా సంబంధిత అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. కాగా బయటి వ్యక్తులు ఆవరణలో రాత్రి, సెలవు దినాల్లో కూర్చొని మద్యం తాగుతున్నారు.

ఆయకట్టు చెరువులపై అలసత్వమేల..?

● చిట్టడవిని తలపిస్తున్న చెరువుల కట్టలు ● మరమ్మతులకు నోచుకోని తూములు ● ఆందోళనలో అన్నదాతలు

కాశినాయన మార్చి 27: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాగా ఉంది మండలంలోని చిన్న నీటిపారుదల శాఖ అధికారుల పరిస్థితి. నిధుల లేమితో మండలంలో ఆయకట్టు చెరువుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందాన ఉంది. ఆయకట్టు చెరువులకు నీరుచేరకముందే తూములు, కట్టలకు ఏమైనా మరమ్మతులు ఉంటే చూడాల్సిన అధికారులు చెరువుల దరిదాపులకు కూడా రావడంలేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వర్షాలు రాకముందే, తెలుగంగ ఎడమ కాలువకు నీటివిడుదల జరుగక ముందే ఏమైనా మరమ్మతులు ఉంటే చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఆదిశగా అధికారులు చొరవచూపడంలేదు. ఎటు చూసినా చెరువు కట్టలు ముళ్ళ కంపతో చిట్టడవిని తలపించేలా ఉన్నాయి .ఓబుళాపురం, పిట్టిగుంట చెరువుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దాదాపు కిలోమీటరు పొడవున్న ఈచెరువుకట్ట మీదుగా ఒకప్పుడు రాత్రనక పగలనక ట్రాకర్లు, ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు యథేచ్ఛగా తిరిగేవి. చెరువుకు ఆవల ఉన్న లింగారెడ్డిపల్లె, అక్కసిద్దుపల్లె, పిడుగుపల్లె తదితర గ్రామాల విద్యార్థులు కట్టపై రాకపోకలు సాగిస్తూ చెన్నారెడ్డిపల్లెకు వచ్చి హైస్కూల్ విద్యాభ్యాసం చేసేవారు. నేడు పరిస్థితులు అందుకుభిన్నంగా మారాయి. చెరువుకట్టపై ముళ్ళకంప బలంగా అల్లుకొని పోయింది.కట్టలు కుచించుకపోయి బలహీనంగా మారాయి.కట్టపై నడిచివెళ్లాలని ప్రయత్నించినా ముఖాలకు గాయాలు అయ్యే పరిస్థితి. చెరువుకింద భూములున్న రైతులంతా పేదవారే. పంట సాగుచేసుకున్నా పండిన పంటను రైతులు, ఎద్దులబండ్లతో,ట్రాక్టర్‌లతో ఇంటికి తోలుకోవాలన్నా వీలుగాని పరిస్థితి నెలకొంది. కనీసం చెరుకట్ట మీదుగా మనిషి నడిచిపోవాలన్నా కష్టతరంగా ఉందని రైతులు అంటున్నారు. 4 సంవత్సరాలుగా పిట్టిగుంట చిన్నచెరువు తూముకు వాకిలి లేకపోవడంతో వర్షాకాలం చెరువుకు నీరువచ్చినా కాలువలకు వదులుకొని పంటలు పండించుకొనే అవకాశం లేకుండా పోయిందని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతులకు నోచుకోని పిట్టిగుంట చెరువు తూము



ఓబుళాపురం చెరువు కట్టపై తుమ్మకంప